మందుబాబుల అడ్డా..!


పిల్లిగుట్టల ఖాళీ ప్రదేశం

సిట్టింగ్‌కు కేరాఫ్ పిల్లిగుట్టలు

- నిత్యం క్యూ కడుతున్న మద్యంప్రియులు
- గొడవలు, అరుపులతో రచ్చరచ్చ
- నామమాత్రంగా పోలీసుల తనిఖీలు
- రాత్రి వేళ బయటకు రాలేక ఇబ్బంది పడుతున్న స్థానికులు

ఖమ్మం రాపర్తినగర్: మందు తాగేందుకు సరైన అడ్డా దొరకడం లేదని చింతించే వారికి వెంటనే గొర్తొచ్చే ప్రాంతం పిల్లిగుట్టలు. ఇవి నగరంలోని రాపర్తినగర్ ఉండగా.. ఈ ప్రాంతానికి వెళ్తే అడిగేవారు ఎవరూ ఉండరని, ప్రశాంతంగా సిట్టింగ్ వేయొచ్చనే భావనతో మందుప్రియులు అక్కడకు క్యూ కడుతున్నారు. బ్యాచ్‌ల వారీగా ఎంత మందైన సిట్టింగ్ వేసేలా విశాలంగా ఉండడంతో చాలా మంది అక్కడకు వెళ్తున్నారు. కాగా, ఆ ప్రాంతంలో నివాసించే వారు మాత్రం మందు బాబులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లల్లో వచ్చి సిట్టింగ్ వేయడం, గొడవలు పెట్టుకుంటున్నారని, ఏదైనా అడిగితే ఇది మీ జాగానా? అంటూ ఎదురు తిరుగుతున్నారని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాన అటుగా వెళ్లాలంటేనే భయంగా ఉంటుందని వాపోతున్నారు.

పట్టించుకోని మున్సిపల్ శాఖ

ప్రతీ రోజు ఇక్కడ మద్యం సేవిస్తున్నట్లు ఆనవాళ్లు ఉన్నా.. మున్సిపల్ శాఖ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే నగరంలో ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకుంటున్నా.. ఈ స్థలం మాత్రం ప్రభుత్వానిదా? లేక ఇతరులదా? అనేది అర్థం కావడం లేదు. ప్రభుత్వమైన, ప్రైవేటు వ్యక్తులదైన దాని చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఆ ప్రాంత వాసులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక మందు బాబుల బారి నుంచి తమను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం ఘర్షణలే..

బైపాస్ రోడ్డులోని పలుషాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి తిండి పదార్థాలు, నీళ్లు, గ్లాసులు తీసుకొచ్చి ఇక్కడ మద్యం సేవిస్తున్నారు. అంతేగాక మందు తాగిన తర్వాత ఖాళీ సీసాలను పగలకొడుతుండడంతో ఆ రోడ్డుగా వెళ్లేవారికి గాయాలవుతున్నాయనే ఆరోపణలున్నాయి. అంతేగాక మందుబాబులకు మధ్య నిత్యం ఏదో ఒకవిధంగా వివాదాలు చోటు చేసుకుని కొట్టుకున్న సంఘటనలు కూడా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాక రాపర్తినగర్ బోర్డు నుంచి బీసీ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీవాసులు ఆ దారి వెంట రాత్రి వెళల్లో వెళ్లాలంటే భయపడాల్సి వస్తుందంటున్నారు. కొన్నిసార్లు వాహనదారులను ఆపి బెదిరించిన సంఘటనలూ ఉన్నాయి. కాగా, ఇటీవల నగరంలోని మమత రోడ్డు, ఫైవ్ ఎలిమెంట్స్ వెనుక ఉన్న ఖాళీ జాగాలో పార్క్ చేసిన ఓ కారు అద్దాన్ని మందు బాబులు పగులగొట్టడం గమనార్హం.


కారు అద్దం పగిలిన దృశ్యం

రోడ్లపై ఆకతాయిల ఆగడాలు..!

నేలకొండపల్లి: ఆకతాయిల వికృత చేష్టలు రోజు రోజుకు హెచ్చుమీరుతున్నాయి. మద్యం మత్తులో రోడ్లపై సీసాలను పగలగొడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మండలంలోని బైరవునిపల్లి గ్రామం నుంచి అజయ్‌తండా వయా నేలకొండపల్లి మీదుగా వెళ్లే రహదారిపై మద్యం మత్తులో అర్ధరాత్రి రోడ్లపై బాటిళ్లను పగలగొడుతూ హల్‌చల్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అటుగావెళ్లే రైతులు, విద్యార్థులు, ఇతరులు రోడ్డుపై దాదాపు అర కిలోమీటరు వరకు అక్కడక్కడ పడి ఉన్న సీసాలు ఎక్కడ గుచ్చుకుంటాయోనని భయపడుతున్నారు. రాత్రి వేళ రైతులు పొలాలకు వెళ్లడమే మానేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డుపై పగలగొట్టిన మద్యం సీసాలు

'నూకల'కు మంత్రుల నివాళి


నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డి దశదిన కర్మకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతాపసభలో వారు మాట్లాడుతూ.. సౌమ్యుడు, ప్రజల మనిషి నూకలను కోల్పోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు జాటోత్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబులతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, రామసహాయం నరేష్‌రెడ్డి, పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, తుళ్ళూరు బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాధమ్మకు మంత్రి తుమ్మల నివాళి

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాకు చెందిన కిసాన్ ఆటోమొబైల్స్ అధినేత చల్లపల్లి శ్రీనివాస్ తల్లి చల్లపల్లి రాధమ్మ(90) మృతి చెందగా మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు సాధు రమేష్‌రెడ్డి, మేయర్ పూనుకొల్లు నీరజ, నల్లమల వెంకటేశ్వరరావు, రాపూరి సైదుబాబు, తుపాకుల ఎలగొండస్వామి తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చేప పిల్లల పంపిణీ


చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఏడీ

కూసుమంచి: ప్రభుత్వం ఆధ్వర్యాన ఉచితంగా అందిస్తున్న చేపపిల్లలను మంగళవారం మండలంలోని పలు చెరువులకు మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివప్రసాద్ పంపిణీ చేశారు. చేపలను పెంచి వాటి ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా బలపడాలని కోరారు. మండలంలో 7 పెద్ద చెరువులకు గానూ 3 లక్షల చేప పిల్లలు, 31 చిన్న తరహా చెరువులకు గానూ 3.63 లక్షల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు ఏడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ చాముండేశ్వరీ, మత్స్య సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న తాండ్ర వినోద్‌రావు

ఖమ్మంరూరల్: మండలంలోని బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు సమక్షంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నుంచి మంగళవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా తాండ్ర మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి బీజేపీలో చేరారని తెలిపారు. మోదీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నసైదులు, శంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ కార్పొరేటర్, బీజేపీ జిల్లా నాయకుడు దొంగల సత్యనారాయణ పాల్గొని ఇంటింటికి వెళ్లి సభ్యత్వాలు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ మోటార్లు చోరీ


కోరట్లగూడెంలో చోరీకి గురైన మోటార్

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంలో మంగళవారం విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన మారుతి భూషయ్య, సుంకర వెంకటేశ్వర్లు, బాజా శ్రీనులకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పంట చేతికొచ్చే సమయాన మోటార్లు చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇద్దరు రేషన్ డీలర్లకు షోకాజ్ నోటీసులు

నేలకొండపల్లి: మండలంలోని ఇద్దరు ప్రభుత్వ చౌక దుకాణం డీలర్లకు మంగళవారం తహసీల్దార్ జె.మానిక్‌రావ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సుర్దేపల్లికి చెందిన డీలర్ సోమయ్య, అనాసాగారం డీలర్ పి.రామకృష్ణలపై వివిధ ఫిర్యాదులు అందాయి. సుర్దేపల్లి రేషన్ డీలర్ ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో వ్యక్తిగత ప్రచారం చేసుకోవడంతో పాటు వివిధ అంశాలపై స్థానికులు ఫిర్యాదులు చేశారు. అనాసాగారం డీలర్ పంపిణీ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు అందాయి. దీంతో తహసీల్దార్ మంగళవారం ఇద్దరు డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వారంలోగా లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల రేషన్ డీలర్లు రాజకీయాల్లో జోక్యం చేసుకోవడంతో స్థానికుల ఫిర్యాదులు వరసగా అందుతున్నాయి.

మార్బుల్ వర్కర్ అదృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 6వ డివిజన్ ప్రశాంతినగర్‌కు చెందిన మార్బుల్ వర్కర్ మహ్మద్‌ఖాజావియా అదృశ్యమైనట్లు తండ్రి జమీలుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఖమ్మంఅర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖాజామియా ఈనెల 14న పని కోసం అడ్డాకు వెళ్లి తిరిగి రాలేదని, సాయంత్రం వెళ్లి ఆరా తీస్తే సైకిల్, క్యారేజీ అడ్డా వద్దనే ఉండడం, వ్యక్తి కనపడకపోవడంతో అనేక చోట్ల ఆరా తీసి ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామానికి చెందిన నాగండ్ల జయమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబానికి తమ వంతు సాయం అందించాలనే ఉద్దేశంతో మంగళవారం మాజీ గ్రామ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు మృతురాలి భర్త మధవరావుకు బియ్యం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో గుత్తా వంశీ, కాళంగి వీరబాబు, బాగం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ ఉద్యాన అధికారిగా రాధిక?

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యాన అధికారిగా బెల్లం రాధికను నియమిస్తూ ఉత్తర్వులు సిద్ధమైనట్లు సమాచారం. అటవీశాఖలో ఎఫ్ఆర్‌ఓగా పనిచేస్తున్న ఆమెను నియమిస్తూ సీఎంఓ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈరోజు లేదా రేపు ఈ ఉత్తర్వులు కేఎంసీ కార్యాలయానికి అందనున్నట్లు సమాచారం.

తహసీల్దార్‌గా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా వి.రవికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తల్లాడ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయనను ఖమ్మంఅర్బన్‌కు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్నికల విభాగం డీటీ కల్పన నుంచి రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా ఉన్న స్వామి సహకాలంలో సర్టిఫికెట్ జారీ చేయకపోవడంతో తాను ఉద్యోగం కోల్పోయినట్లు గ్రీవెన్స్‌లో ఒక మహిళ ఫిర్యాదుపై కలెక్టర్ స్వామిని కలెక్టరేట్‌కు సరేండర్ చేసిన విషయం తెలిసిందే.

మానసిక దివ్యాంగులకు అన్నదానం


దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో గల మదర్‌థెరిస్సా మానసిక దివ్యాంగుల కేంద్రంలో రఘునాథపాలెంకు చెందిన చావా బోసు బాబు ద్వితీయ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు మంగళవారం అన్నదానం చేశారు. అలాగే రఘునాథపాలెం పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచి బోసుబాబు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చావా విద్యాధరి, నల్లమోతు శ్రీనివాసరావు, రాంబాబు, ఆత్మకూరి నాగేశ్వరరావు, గాజుల గోపాలరావు, మద్దినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం శరత్ మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి సహకారంతో జిల్లా సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం చర్చి కాంపౌండ్‌లోని గాంధీ పార్కులో గల సంఘ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కోరారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ మాట్లాడుతూ... ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం అవుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కొత్త సత్యనారాయణరెడ్డి, శ్రీహరి, సాధినేని జనార్దన్‌రావు, జెల్లా వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, తాత రాఘవయ్య, రచ్చ రామారావు, ఉపేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	64	బచ్చలికూర	3
వంకాయ	40		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	48		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	44	తోటకూర	3
దొండ	34		20
పొట్లకాయ	44	గోంగూర	5
చిక్కుడు	70		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		50
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	64		25
క్యాప్సికం	80	-ఖమ్మం వ్యవసాయం	

పెండింగ్ బిల్లులు ఇప్పించండి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల సమయాన తాము చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టర్లు మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. అత్యవసర పనులను చెప్పి పనులు చేయించారని, ఏడాది కావొస్తున్నా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని కలెక్టర్‌కు విన్నవించారు. రూ.1.12 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉందని, వడ్డీలకు తీసుకొచ్చి మరీ పనులు సకాలంలో పూర్తి చేశామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పరిశీలన చేసి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వరరావు, కాంట్రాక్టర్లు జూగల కిషోర్, శ్రీహరిరాజు, పాలకుర్తి కృష్ణ, బండి సతీష్, టి.శ్రీనివాస్, శ్రీధర్, దిలీప్‌రెడ్డి, వనం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలపై కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్, డివిజన్‌వాసులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 27వ డివిజన్ శ్రీనివాసనగర్ ప్రాంతంలో గల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక కార్పొరేటర్ దొడ్డ నగేశ్‌తో కలిసి స్థానికులు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, డ్రెయినేజీలు లేక మురుగు నీరు ఖాళీ స్థలాలు, రోడ్లపైకి చేరుతుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, మంచినీరు రావడం లేదని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు దండమూడి గిరిజ, మోదేపల్లి రాజలక్ష్మి, చేకుట్ల కుమారి, జెట్టి శిరీష, ఎంకే సత్యవతి, మేడవరపు చరిత, కొప్పుల అనూష, పత్రి అనసూర్య, రోహిత్, భారతి, గునుగుంట్ల నాగార్జున, దొడ్డ నాగరాజు, గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న జరిగే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య అన్నారు. ములకలపల్లి లక్ష్మీనారాయణ, గోస్ పుల్లయ్యల అధ్యక్షతన రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పాలేరు, ఖమ్మం ఏరియా సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. 1978లో మన రాష్ట్రంలో ఏర్పడిన ఐఎఫ్‌టీయూకు అనుబంధంగా ఉన్న వివిధ కార్మిక సంఘాలను నిర్మాణం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో బలమైన కార్మిక ఉద్యమాన్ని బీడీ, భవన, ఆటో-మోటార్, కేజీబీవీ, హమాలీ, మిల్ గోదాం మున్సిపల్ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వర్కర్లు, గ్రామపంచాయతీ తదితర రంగాల్లో నిర్మించే కృషి సాగుతోందన్నారు. దేశ వ్యాప్తంగా కార్మిక సంఘ నిర్మాణానికి ఐఎఫ్‌టీయూ కృషి చేస్తుందని, ఇందుకు ఐఎఫ్‌టీయూను టీయూసీఐలో విలీనం కావడం కోసం పూనుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ కార్యదర్శి కె.శ్రీనివాస్, పాలేరు ఏరియా కార్యదర్శి పగిడి కత్తుల రామదాసు, నాయకులు శీలం లెనిన్, బి.రమేష్, సక్రు, జోగా కోటేశ్వరరావు, ప్రభాకర్, మాధవరావు, కందుల వెంకటేశ్వర్లు, అక్కి నాగరాజు, శ్రీనివాస్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధే నాబార్డు లక్ష్యం


బచ్చోడులో మాట్లాడుతున్న వెంకన్న

తిరుమలాయపాలెం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే నాబార్డు లక్ష్యమని సాయి స్వచ్ఛంద సంస్థ సీఈఓ వెంకన్న అన్నారు. మంగళవారం మండలంలోని బచ్చోడు గ్రామంలో సంస్థ ఆధ్వర్యాన మహిళలకు కుట్టు శిక్షణ, మగ్గం నేత, ఎంబ్రాయిడరీ తదితర కంప్యూటర్ వర్క్‌లపై 30 మంది మహిళలకు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. బచ్చోడు గ్రామాన్ని జిల్లాలో ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు చదువుకొని నిరుద్యోగులకు ఈ విధంగా ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బచ్చోడు రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ మోటాపోతుల శ్రీనివాస్‌రావు, మాజీ చైర్మన్ తిమ్మిడి హనుమంతరావు, బోర్డు సభ్యులు వేములపల్లి రామయ్య, సైదులు, సీఈఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


ఎర్రగడ్డతండాలో వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ

కూసుమంచి: తెగుళ్లు సోకకుండా పంట రక్షణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ రామడుగు వాణి సూచించారు. మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో తెగుళ్లు సోకిన వరి పొలాలను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. దుబ్బతండా, ఎర్రగడ్డతండా, కొత్తూరు, గైగోళ్లపల్లి గ్రామాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు సోకగా అట్టి పొలాలను పరిశీలించి రైతులకు తగు సలహాలు, సూచనలు అందించారు. పొలాల్లో పాత నీరు బయటకు పంపి కొత్తనీరు పెట్టడం వలన కూడా ఈ వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మానస, రైతులు పాల్గొన్నారు.

'పాలేరు'లో రహదారులకు మోక్షం!

32 రోడ్లకు రూ.29 కోట్లతో ప్రతిపాదనలు


బైరవునిపల్లిలో భవనాన్ని పరిశీలిస్తున్న డీఈఈ

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులకు మోక్షం కలిగింది. నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో 16 రోడ్ల చొప్పున మొత్తం 33 రహదారులకు దాదాపు రూ. 29కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలు మేరకు మంగళవారం పలు గ్రామాల్లో పంచాయతీరాజ్ డీఈఈ టి.వంశీ రహదారులను పరిశీలించారు. నిధులు మంజూరు కాగానే మండలంలోని అమ్మగూడెం-3, మోటాపురం-1, కోరట్లగూడెం-1 రహదారి పనులను ప్రారంభించనున్నట్లు డీఈఈ తెలిపారు.అనంతరం బైరవునిపల్లిలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో యువత ముందుండాలి


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అధ్యక్షతన జరిగిన యంగ్ కమ్యూనిస్ట్ వర్క్‌షాపులో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేటి యువత వ్యక్తిగత విషయాలతో పాటు సమాజంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని అధ్యయనం చేస్తూ అవసరమైన సందర్భంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. రాజకీయ రంగంలో జరుగుతున్న అవినీతిని వ్యతిరేకించాలని కోరారు. సమాజాన్ని, యువతను పక్కదారి పట్టించే మద్యం, గంజాయి, డ్రగ్స్ తదితర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, షేక్ బషీరుద్దీన్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు పానుకుల సుధాకర్, తుడుం ప్రవీణ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.